


యద్దనపూడి సులోచనారాణి

"చాలు. అక్కడికి ఆపేసి అది టైప్ చెయ్యండి. మిగతాది రేపు డిక్టేట్ చేస్తాను." పాంటుజేబులో చేతులు పెట్టుకుని గదిలో అటు యిటు పచార్లు చేస్తున్న సారథి హఠాత్తుగా ఆగి కిటికీ దగ్గరకువెళ్ళి తొంగిచూస్తూ అన్నాడు. ఆతనెందుకు మధ్యలో అలా ఆపు చెయ్యా మంటు

న్నాడో జయంతికి తెలుసు. క్రింద కారు హారన్ విన్పించింది. ఆ హారన్ జయంతికి సుపరిచితమె, మిసెస్ సారథి సాయంత్రం క్లబ్‌కు వెడ్తు భర్తకోసం ఆఫీసుకు వచ్చింది. ఇక్కడ నుంచి యిద్దరూ కలిసి వెడ్తారు. వ్రాయటం ఆపేసిన జయంతి బుక్ మూసేసింది. కుర్చీకి తగిలించిన కోటు తీసి వేసుకుం టున్న సారథి క్షణంసేపు తటపటాయించి జయంతివేపు చూస్తూ "మీరేమీ అనుకో పోతే – రేపువస్తే – అదికొంచం పూర్తి చేసేద్దాం. నేను బుధవారం లోపల రిపోర్టు గవర్నమెంటుకి పంపించే పెయ్యాలి."

టైప్ రైటర్‌కి తెల్లకాగితాలు బిగించ బోతున్న జయంతి ఆగి సారధివైపు చూసింది. రేపు ఆదివారం. సుందరి భోజనానికి పిలిచింది. సినిమాకు వెళ్ళాలి అని ప్రోగ్రాంకూడా వేసుకున్నారు.

"సారీ! మీకు టైముండే నే! యెక్కువసేపు పట్టదు. ఒకటి రెండు గంటలుచాలు." సారధికి తనంటే తనకే అసహ్యం వేసింది. ఇప్పుడిలా మధ్యలో ఆపేసివెళ్ళటం అతని కేమాత్రం యిష్టం లేదు. అమూల్యతో వెళ్ళి తను చేయబోయే ఘనకార్యం కూడా యేమీలేదు. 5 గంటలు దాటితే ఆఫీసులో వుండటం అమూల్య సహించలేదు. అమూల్యని పెళ్ళి చేసుకున్న రోజునే సారధి తన స్వంత అభిప్రాయాలకి తిలాంజలిచ్చేశాడు. సహజంగా భార్యలు భర్తలతో సర్దుకు పోతారని వినికిడి. కాని భార్యలతో సర్దుకు పోయే భర్తలుగూడా వున్నారని ప్రపంచంలో చాలా కొద్దిమందికి తెలుసు నేమో!

క్రిందనుంచి కారు హారన్ మరోసారి బొంయ్ బొంయ్ మని విన్పించింది. అందులో యేమిటింకా ఆలస్యం అన్న హెచ్చరిక వుంది. పెన్ తీసుకుని కోటు జేబుకి పెట్టుకున్న సారధి హడావుడిగా కళ్ళజోడు తీసుకిని పెట్టుకుంటూ "ప్లీజ్! మీరు రేపు ఒక్కసారి తప్పకుండా రావాలి." అని త్వరత్వరగా బైటకెళ్ళి పోయాడు. బైట.

"చూడు రంగయ్యా! ఆ అమ్మాయి యింకొంచంసేపు వుంటుంది. కాఫీ, టిఫిన్ తెచ్చివ్వు. నువ్వుగూడా వుండు. ఇదిగో డబ్బులు." అని చెప్పటం విన్పిం చిన జయంతి నిట్టూర్పు విడిచి టైప్ రైటర్ వదిలి లేచి కిటికీ దగ్గరగా వచ్చింది.

మూడో అంతస్థులో పై భాగంలో వున్న ఆ గదిలోంచి చూస్తే క్రింద విశాలంగావున్న ఆవరణ కన్పిస్తుంది. ఆ ఆవరణలో ఆకుపచ్చటి పొడుగ్గా విమానంలా రెక్కలు చాచుకొని వున్న పెద్దకారు. డ్రైవింగ్ సీటులో ఓ చెయ్యి స్టీరింగ్ మీద వేసుకుని అమూల్య కూర్చునివుంది. లేత ఆకుపచ్చరంగు చీర. దానికి కలిసే ముదురాకుపచ్చ

రంగులో భుజాలులేని జాకెట్ మెళ్లో పొడుగ్గా తెల్లటి ముత్యాలదండ రెండు వరసల్లోవుంది. అమూల్య జుట్టు రోజుకో రకంగా వుంటుంది. ఈ రోజు నడినెత్తి మీద సిగవేసుకుంది.

జయంతి చూస్తుండగానే సారధి వెళ్ళి డోరుతెరిచి లోపల కూర్చున్నాడు. అమూల్య చేతికున్న వాచీ చూసుకుంటూ యేదో అంటోంది. అమూల్య అడిగిన దానికి జవాబు చెబుతుండగానే సారధి చూపులెందుకో హఠాత్తుగా పైకివెళ్ళి తన ఆఫీసుగదిమీద నిల్చాయి. అక్కడ కిటికీచువ్వలు పట్టుకుని బొమ్మలా నిలబడ్డ జయంతి క్రిందకు చూస్తోంది. సారధి మనసు కలుక్కుమంది. క్షణం సేపు అమూల్య కేదైనా సాకుచెప్పి దిగి ఆఫీసు లోకి వెళ్ళిపోవా లనిపించింది. ఈ లోపలే అమూల్య కారు రివర్స్‌చేసి వెనక్కు తిప్పేసింది.

కారు వెళ్ళిపోవటంతో జయంతి మళ్ళీ వచ్చి సీటులో కూలబడింది. ఆఫీసులో ఒకళ్ళిద్దరు తప్ప మిగతా అందరూ వెళ్ళి పోయారు. సారధి వున్నంతసేపు బాగానే వుండే ఆఫీసు అతను వెళ్ళిపోగానే విసుగ్గా అన్పించసాగింది. మాటర్ టైప్ చేస్తున్నా జయంతి ఆలోచనలు కారు వెంట పరుగెత్త సాగినాయి.

సారధి చాలా అదృష్టవంతుడు. చిన్న వయసు. పెద్దహోదా! అందమైన భార్య. అందరిలో ప్రత్యేకంగా చూపించగ ఆస్థి. ఇన్నివున్నా సారధి అందరిలో సగర్వంగా, ఠీవిగా చొచ్చుకు పోవ బదులు, తప్పుచేసిన వాడిలా, ఆర్ద్రతలే! వాడిలా నెమ్మదిగా, నిదానంగా యెంద కుంటాడో అర్థంగాదు.

జయంతి కూర్చున్న గదికి మరొ రెండు గదుల అవతల కిటికీదగ్గర నిలబడ్డ మరోవ్యక్తి మనసుగూడా సారధితో పాటె వెళ్ళింది. అతను శివరామ్. కొత్తగా క్లర్క్‌గా వచ్చాడు. శివరామ్ సారధి కలిసి ఇంటర్ చదివారు. అప్పుడు దాదాపు సారధి పరిస్థితులు శివరామ్ పరి స్థితులు ఒకటివిగానే వుండేవి. ఇంటర్ పాసయింతర్వాత సారధి అమూల్యని పెళ్ళిచేసుకుని యిల్లరికం వెళ్ళిపోయి బి.ఎ. పాసయి ఐ.ఎ.యస్.కి వెళ్ళాడు. మామగారి పలుకుబడితో మంచి వుద్యోగం వచ్చింది. ఆర్థిక పరిస్థితులు సరీగ్గాలేని శివరామ్ బి.ఎ. తప్పి వుద్యోగం కోసం విసిగివేసారి చివరికీ ఆఫీసుకు వచ్చాడు. సారధిని గుర్తుపట్టిన శివరామ్‌కి వుద్యోగం చెయ్యడం యిష్టం లేదు. కాని తప్పదు. వెరికక్క వెరికక్క దొరికిన వుద్యోగం. ఆత్మాభిమానం అను కుంటే ఇంటిదగ్గర తల్లి యిద్దరు చెల్లెళ్ళు పస్తులు పొడుకోవాలి. శివరామ్‌కి సారధిలో లేని చురుకుదనం వుంది. తెలివితేట లున్నాయి. కాని అదృష్టం లేదు. చేతిలో వున్న సిగరెట్‌ని అవతల

పారేసి వచ్చి సీటులో కూలబడి అర్జంట్ అని వున్న ఫైల్స్ తీసి రాయసాగాడు.

* * *

మర్నాడు వుదయం మంచిమబ్బుపట్టి చలిగాలి వీస్తోంది. సన్నగా వర్షపు చినుకులు రాల్తున్నాయి. సారథి 10-30కే వచ్చి ఆఫీసులో కూర్చున్నాడు. ఈ యీదురుగాలి వాన చూస్తుంటే జయంతి రాదేమో అన్పించింది. రాకపోతేనే నయం. జయంతి గుర్తు వచ్చినప్పుడల్లా అతనికేదో బాధనిపిస్తోంది. సారథి కసలు ఆడవాళ్ళు వుద్యోగంచెయ్యటం అంటేనే యిష్టంలేదు. అందులో ఒకవిధంగా స్కూల్సులోను, డాక్టర్సంటే ఫర్వాలేదు గాని, యిలా ఆఫీసులో గుమాస్తాలుగా, టైపిస్టులుగా చేసేది అసలే యిష్టంలేదు. జయంతిని గూడా అతను జన్మలో తీసుకునేవాడు కాదుగాని, బి. ఎ. చదువు తుండగా తనంటే విపరీతమైన అభిమానం చూపే లెక్చరర్ ఒకాయన గట్టిగా సిఫార్స్‌చేస్తూ ఉత్తరం రాసాడు. స్వయంగావచ్చి చెప్పాడుకూడా. జయంతి వుద్యోగంలో చేరిగూడా దగ్గర దగ్గర అర్నెల్లు అవుతోంది. కాని ఆఫీసులో యెలాటిగొడవలూ లేవు. టైమ్‌కు వచ్చి తనపని చూసుకుని తలవంచుకుని టైమ్‌కు యింటికి వెళ్ళిపోయే జయంతి లాటి వాళ్ళతో పెట్టుకుందామన్నా సృష్టిద్దామన్నా యెలాటి సమస్యలూ రావు అని సారథి గ్రహించాడు.

స్ప్రింగ్‌డోరు కదిలిన చప్పుడు విన్పించటంతో సారథి ఆత్రంగా గుమ్మం వైపు చూసాడు. వెంటనే అతని కనుబొమలు ముడిపడ్డాయి. వచ్చింది జయంతికాదు. శేఖరం. "పీడః వెధవ్వాన. వానంటేనే నాకు అసహ్యం." రైన్‌కోటు విప్పి అక్కడున్న కుర్చీకి తగిలిస్తూ అన్నాడు శేఖరం. శేఖరం సారథికి బాగా పరిచయం వున్నవాళ్ళలో ఒకడు. కుబేర పుత్రుడైన శేఖరానికి వుద్యోగం చెయ్యాలన్న బాధలేదు. అతను కాలక్షేపం కోసం చేసే బిజినెస్ గూడా మంచిమంచి లాభాలు తెచ్చిపెట్తోంది "యేమిటో సీరియస్‌గా రాస్తున్నావల్లేవుందే! పారడైజ్‌లో మంచి పిక్చరుంది. మన ముగ్గురికి సీట్సు రిజర్వ్ చేయించాను." సిగరెట్టు పెట్టెతీసి సారథిని తీసుకోమని చెయిజాస్తూ అన్నాడు. శేఖరం పనే అంత. సరదాగా వ్యాపారం చెయ్యటం, సినిమాలు చూడటం. స్నేహితులతో కాలక్షేపం చెయ్యటం. రాత్రుళ్ళు నిద్ర పట్టకపోతే క్లబ్‌లో పొద్దుపోయేవరకు డబ్బు పెట్టి పేకాడటం. శేఖరానికి నిద్ర రానప్పుడు పేకాడటం యెదుట వాళ్ళకి మంచి లాభం. ఓడిపోయినా గెల్చినా డబ్బు యెదుట వాళ్ళకే వస్తుంది.

"ఇంటికెళ్తే అమూల్య ఆఫీసుకెళ్లావని చెప్పింది. ఆదివారంపూటగూడా ఏం ఆఫీసు?" సిగరెట్ వెలిగిస్తూ వెనక్కు జారగిలబడ్తు అన్నాడు తాపీగా శేఖరం.



''ఇప్పుడు చెప్పు - నన్ను ప్రేమిస్తావా, లేదా ?''

సారధి చూపులు మాటిమాటికీ వెళ్ళి గుమ్మం మీద నిలుస్తున్నాయి. జయంతి రాకుండా వుంటే బాగుండు. వచ్చినా శేఖరం వూరుకోడు బలవంతంగా తనని సినిమాకు లాక్కెడ్తాడు.

"ఏమిటి మాటిమాటికి గుమ్మం వైపు చూస్తావు ? ఎవరిన్న వస్తారా ?'' శేఖరం సారధి మొహంలోకి చూస్తూ అడిగాడు.

ఏమైనాసరే! ఈరోజు జయంతిని నిరుత్సాహ పరచగూడదు. తను సినిమా కెళ్ళడు. ఆ అమ్మాయి పాపం అంత దూరంనుంచి తన మాటమీదవచ్చి తిరిగ వెళ్ళిపోగూడదు. సారధికి ధైర్యంలాటిది వచ్చింది. హఠాత్తుగా తలెత్తుతూ "శేఖరం! సారీ! నేనురాలేను. అమూల్య నువ్వు కలిసి వెళ్ళండి, నాకు అర్జంట్ రిపోర్ట్ ఒకటి గవర్నమెంటుకి పంపే పనుంది. ప్లీజ్. నువ్వు వెళ్ళు." అని సీరియస్‌గా రాసుకోవటంలో మునిగి పోయాడు. అతని వాలకం చూస్తే శేఖరానికి తను అక్కడ కూర్చోవటం గూడా డిస్టర్బేమో అన్పించింది. రెండు నిమిషాలు ఆగి లేస్తూ 'ఆల్‌రైట్! ఓ. కె. నాకేమీ అభ్యంతరంలేదు. కాని. అమూల్య.''

"నేను తర్వాత చెప్తాను." రాసు కుంటూనే కట్ చేసాడు సారధి.

"సరె" కుర్చీమీద పడేసిన రైన్ కోటు తీసి చేతిమీద వేసుకుని వెడ్తానని చెప్పి బైటకొచ్చేసాడు. అమూల్యతో తను ఒక్కడూ వెళ్ళటం శేఖరానికేమాత్రం యిష్టంలేదు. ఆ అయిష్టం అతని మొహంలో కనుబొమలు ముడి పడేలా చేసింది. కనుబొమలు ముడుచుకుని పరధ్యాసగా స్ప్రింగ్ డోరు తెరిచి బైట రాబోయిన శేఖరం ఎదురుగుండా తలవంచుకుని వస్తూ వానచినుకులికి శరీరానికి అతుక్కుపోయిన చీరెని సరిదీసుకుంటున్న జయంతికి డాష్ యివ్వబోయి ఆగిపోయాడు. దాదాపు అతని గుండెల వరకూ వచ్చిన జయంతి హఠాత్తుగా నిలవదొక్కుని ఆగబోయి వెనక్కు పడబోయింది. ఇంతలో శేఖరం చెయి చాచి బలంగాపట్టుకుని ఆపాడు. క్షణం సేపు యిద్దరికళ్ళూ కలుసుకున్నాయి. ఒకళ్ళని ఒకళ్ళు పరీక్షగా చూసుకున్నారు. వానచినుకులకి చీర మెత్తగా అయిపోయి వంటికి పట్టుకుపోయింది. మొహంమీద ఒకటి రెండు ముంగురులు నుదుటికి వుంగరాల్లా అతుక్కుపోయినాయి. బుగ్గలమీద గడ్డంమీద యింకా వాన తాలూకు తడి స్పష్టంగాకన్పిస్తోంది. బద్ధకంగా, విసుగ్గా వున్న శేఖరం కళ్ళకి సౌందర్యానికి మారుపేరులా, మలచిన శిల్పంలావున్న యీ రూపం హాయిగా అన్పించి మరింత ఆసక్తితో పరీక్షగా చూసేలా చేసింది.

"సారీ!" కళ్ళు క్రిందికి వాలిపోగా అంది జయంతి.

"నేను అదే చెప్పాలనుకుంటున్నాను." ఈ లోకంలోకివస్తూ అన్నాడు శేఖరం. తప్పుకుని ప్రక్కకు తొలిగి దారియిస్తూ. జయంతి లోపలికి వెళ్ళిపోయింది. శేఖరానికి ఆమె వెంటే మళ్ళీ వెనక్కు వెళ్ళాలనిపించింది. కాని, ఛీ! సారధి విసుక్కోవచ్చు. సభ్యతమాట గుర్తొచ్చిన శేఖరం ఆ కోర్కెని బలవంతంగా అణుచుకుని వెళ్ళిపోయాడు.

రెండు గంటలు అని చెప్పిన సారధి నాలుగ్గంటలు డిక్టేట్ చెసాడు. డిక్టేట్ చెయ్యటం పూర్తయింతర్వాత రంగయ్య చేత కాఫీ టిఫిన్ తెప్పించాడు. టిఫిన్ తింటున్నా, కాఫీ తాగుతున్నా, టైప్ చేస్తున్నా జయంతి కళ్ళముందు తెల్లగా, పొడుగ్గావుండి, ఓ చేతిమీద రైన్‌కోటు వేసుకున్న అతని రూపమె కదుల్తోంది. అతనెవరో జయంతికి తెలియదు. కాని అతని రూపంమటుకు తను యిప్పట్లో మర్చిపోలేదు.

జయంతి టైప్ చెయ్యటం పూర్తయిపోతుండగా గదిలో అటుయిటు తిరుగుతున్న సారధి కిటికీ దగ్గరకెళ్ళి బైటకు చూస్తూ "వాన తగ్గిపోయింది''అన్నాడు. తగ్గకపోయినా ఫర్వాలేదు. ఇంటికెళ్ళే

శేఖరం మొహంలో ప్రశ్నార్థకం చూసిన అమూల్య సమాధానంగా ప్రక్కనే పుస్తకంలో వున్న చిన్నకవరు తీసి శేఖరం వైపు పడేసింది.

తనమీద పడి క్రిందపడబోయిన కవరుని శేఖరం ఆత్రంగా తీసిచూసాడు. అందులో వున్న చిన్న కాగితం మీద నాలుగే నాలుగు వాక్యా లున్నాయి. అది వుత్తరం అనటానికి గూడా వీల్లేదు. సంబోధనగాని, చివరసంతకం గాని లేని వుత్తరం. అందులో యిలా వుంది.

"ఆఫీసులో లేడీ క్లర్కుతో మీ భర్త గారి సరస సల్లాపాలు చూసే తీరిక మీకు లేదా? లేక చూడదలుచుకో లేదా? లేడీ క్లర్కుని వెంటతీసుకుని చీకటిపడింతర్వాత ఆఫీసరుగారు వూరు చివర తిరిగిరావటం యెవరూ మీకు తెలియజేయ లేదులా వుంది. మీరు కొంచం కళ్లుతెరిచి మీవారి ప్రవర్తన అదుపులో పెట్టుకుంటే బాగుంటుంది"

ఒకటికి రెండుసార్లు చదివిన శేఖరం ప్రశ్నార్థకం, ఆశ్చర్యార్థకం మిళితమైన మొహంతో ఆసక్తిగా అమూల్యవైపు చూసాడు. గోళ్ళని జాగ్రత్తగా షేపు వచ్చేలా కత్తిరించుకుంటున్న అమూల్య శేఖరం చూపులు గమనించిగూడా చూసి చూడనట్టు వూరుకుంది.

"ఇంకేదైనా అయితె నమ్మచ్చుగాని, సారధి విషయంలో —"

"ఏం — తనేమైనా దేవలోకంనుంచి దిగివచ్చిన మనిషా?" విసురుగా కట్ చేసింది అమూల్య.

"కాకపోవచ్చు. కాని యిలా దిగజారే మనిషి మటుకుకాదు. ఇదేదీ గిట్టని వాళ్లు రాసిన విషయంలా వుంది."

"అయితే సంతోషించవలసిన విషయమె —" కొంచం ఆగి అమూల్య "కాని సారధిలో యిదివర కెన్నడూలేనిమార్పు ఒకటి కన్పిస్తోంది" అంది.

"ఏమిటది?"

"నాకు తెలిసినంతవరకు అత నిప్పుడున్నంత చురుకుగా యెప్పుడు లేడు."

శేఖరం బిగ్గరగా నవ్వాడు. "అదా! కొంతమందికి వయసు జారిపోతుంటే ఆరిపోతున్న యవ్వనం మరోసారి వెలుగుతుంది అంది. అంతకంటె యేం లేదు."

"యేమో! మగవాళ్ళని నమ్మేదెలా?"

"అనుభవ పూర్వకంగా అంటున్న మాట అనుకోవచ్చా?"

చురుగ్గా శేఖరంవైపు చూసిన అమూల్య సంభాషణ క్రికెట్ మాచ్ మీదకు మళ్ళించేసింది. తన మాటల్ని యెదుట వాళ్ళు యెలా తీసుకుంటారో ఆలోచించే స్వభావం లేని శేఖరం యే మాటనైనా సూటిగా విసిరెయ్యగలడు.

శేఖరం రాగానే హఠాత్తుగా లేచి వచ్చేసిన సారధికి ఆ రోజంతా మనసు యెలాగో వుండిపోయింది. అమూల్య పేరిట వచ్చిన ఆ వుత్తరం శివరామ్

రాసిందని అతనికి స్పష్టంగా తెలుసు. సంవత్సరాలు దొర్లిపోయినా శివరామ్ చేతివ్రాత సారధి మర్చిపోలేదు. చదువుకునే రోజుల్లో కాలేజీలో భాస్కరం అనే అతను రాసినట్టు ఓ అమ్మాయికి ప్రేమ లేఖ రాసాడు. అది ప్రిన్సిపాల్ వరకూ వెళ్ళి దస్తూరి గుర్తుపెట్టి నానాగొడవైంది. శివరామ్ గుర్తురాగానే సారధి మొట్ట మొదటి ఆలోచన అతని వుద్యోగంలోంచి తీసెయ్యాలని. కాని యెలా ? పని విషయంలో అతన్ని యెటువైపునుంచి యెవరూ ఒంక పెట్టలేరు. కాని టైమ్ తీసుకున్నా సాధ్యమైనంత త్వరలో అతన్ని తీసెయ్యటం ఖాయం. ఒక విధంగా బాధగా వున్నా సారధికి ఒక విధంగా మనశ్శాంతిగా వుంది. తెలియనీ ! అమూల్యకి మెల్లిగా తెలియటమే మంచిదేమో ! కాని యిహ తను జాగ్రత్తగా వుండాలి. సారధి జయంతి పరిచయాన్ని రహస్యంగా వుంచుకునేందుకే నిర్ణయించుకున్నాడు. రోజులు గడిచిపోతున్నాయి. జయంతిని వంటరిగా దూరంగా యెక్కడికైనా ఓ గంటపాటు తీసుకెళ్ళాలని బలంగా అన్పిస్తున్నా పుత్తరం మాట గుర్తుకు వచ్చి సారధికి ధైర్యం చాలటం లేదు. అమూల్య హఠాత్తుగా యేదో పని పెట్టుకుని అప్పుడప్పుడు ఆఫీసుకు వస్తోంది. ఆఫీసులోగూడా సారధి జాగ్రత్తగానే వుండాల్సివస్తోంది. సారధిలో రేగుతున్న యీ గాలిదుమారం పీసమాత్రంగూడా యెరగని జయంతి తన పనేదో తను చూసుకుని తనదారిన తను వెళ్ళిపోతోంది.

ఆరోజు ఆఫీసునుంచి మామూలు కంటె గంట ముందుగా వెళ్ళిపోవటానికి పర్మిషన్ అడిగింది.

"ఎందుకు ?" జయంతివైపు పరీక్షగాచూస్తూ అడిగాడు.

"సినిమాకి !"

"ఎవరితో"

జయంతికి నవ్వొచ్చింది. "సుందరి నేను కలిసి వెడ్తున్నాం."

"ఏ సినిమాకి ?"

ఈసారి జయంతి మొహం సీరియస్‌గా మారింది.

ఆఫీసర్ల తత్వమె అంత కాబోలు.

"బెన్ హర్ కి"

"ఇంతవరకూ చూడలేదా ?"

ఎంత అనవసరమైన ప్రసంగం.

"చూసాను. కాని హీరో నా కిష్టం."

"ఏమిటో ప్రత్యేకత."

జయంతి వెనక్కుతిరిగి తన డెస్క్ దగ్గరకు వెళ్ళిపోయింది. సారధి పర్మిషన్ లెటర్ మీద సంతకం చేశాడు.

"నిజమె యేమిటీ ప్రత్యేకత !" "జయంతి తనని తను ప్రశ్నించుకుంది. జవాబు దొరకలేదు. కాని ఏదయినా సరి సమాధానంచెప్పి వుండాల్సింది. "పొడుగాటి మనిషి కాబట్టి" అని చెప్పాల్సింది. సారధిపొట్టి. జయంతికంటె మహా రెండు

అంగుళాలు యెక్కువుండచ్చు అంతే.

"ఏమనుకోకు, వూరికేఅడిగాను"జయంతి వెళ్ళిపోతుండగా అన్నాడు సారధి. జయంతిసమాధానంగానవ్వేళ్ళిపోయింది. "మీరు 'నువ్వు' లోకి దిగింది. జయంతి కిందులో ఆ చనువు అసహ్యం అన్పించింది. జయంతి సినిమా ధియేటర్‌నుంచి ఒంటరిగా బైటకు రావడంతోనే సారధి కన్పించటం చాలా ఆశ్చర్యమనిపించింది.

"నీ స్నేహితురాలేదీ?" జయంతితో సుందరిగాక యింకెవరైనా వచ్చారేమోనని చూస్తూ అనుమానంగా అడిగాడు సారధి.

"రాలేదు. సరాసరి ఆఫీసునుంచి థియేటర్ దగ్గరకువచ్చి కలుసుకోవాలనుకున్నాం. యెందుకు రాలేదో మరి."

చుట్టూ చూస్తూ అంది జయంతి. తెలిసినవాళ్ళెవరైనావుండి చూస్తే సారధి తను కలిసివచ్చారనుకుంటారేమోనని భయపట్టూ.

"నీ కభ్యంతరం లేకపోతే నేను డ్రాప్ చేస్తాను." అన్నాడు సారధి.

జయంతి టైమ్ చూసుకుంది. 9—30 దాటిపోతోంది. రెండు బస్సులు మారాలి. కారులో అయితే పది నిమిషాల్లో యింటికి వెళ్ళిపోవచ్చు. ఆఫీసునుంచి సరాసరి రావటంతో బాగా ఆకలిగూడా అవుతోంది. జయంతి కారులో వెనక కూర్చోబోతుండగా సారధి వారిస్తూ ముందువచ్చి కూర్చోమన్నాడు. జయంతి వచ్చి కూర్చుంది.

సారధి డ్రైవ్ చెయ్యటం మొదలుపెట్టాడు.

"థియేటర్ దగ్గరకి యెందుకు వచ్చానో అడగవే?" సారధి ప్రశ్నించాడు.

"నాకెలా తెలుస్తుంది? మీరిక్కడ యేదైనా పనిమీద వచ్చారేమో అనుకున్నాను." ఆవలిస్తూ అంది జయంతి.

"లేదు నీకోసమె వచ్చాను. నాకెందుకో భలే యీర్ష్య అన్పించింది."

"యీర్ష్య!" అర్థంగానట్టు అడిగింది.

"నువ్వు.....నువ్వు యింకెవరైనా కలిసి—"

"ఛ—ఛ—నాకు అలవాటులేదు. అరె—మా యిల్లు యిటుగాదు." మధ్యలో అంది జయంతి.


"కాదని నాకుతెలుసు. కొంచం అలా వెళ్ళివద్దాం. నీకెలాటి ప్రమాదం రానివ్వనని భగవంతుడి సాక్షిగా చెబుతున్నాను."

జయంతి కేం చెప్పాలో తోచలేదు.

"జయంతీ! నువ్వుచెప్తే నమ్మవు. నీతో కొంచంసేపు మాట్లాడ్తే నాకేదో పెద్ద రిలీఫ్‌గా అన్పిస్తుంది.

ఎన్ని రోజులనుంచి నీతో యిలా సన్నిహితంగా ఒంటరిగా మాట్లాడే అవకాశం దొరుకుతుందా అని చూస్తున్నానో ఆ భగంతుడికే తెలుసు."

మాటలు రానిదానిలా వింటూ




కూర్చుండిపోయింది జయంతి. కారు వూరుదాటి హిమాయత్‌సాగర్ రోడ్డు పట్టింది. కిటికీలోంచి చల్లటిగాలి వీస్తోంది. అక్కడక్కడా దూరంగా మినుకుమినుకు మంటున్న లైట్లు. గంద్రగోళంగా యెప్పుడు చూసినా గలభాగా వుండే సిటీకి దూరంగా వంటరిగా వున్న యీ వాతవరణం హాయిగా ప్రశాంతంగా వుంది. సారధి చెప్పేమాటలు పూర్తిగా వినని జయంతి కొత్తగా కన్పిస్తున్న వాతావరణాన్ని చూస్తూ కూర్చుండి పోయింది. సారధి గూడా మాట్లాడటం మానేసాడు కొంచం సేపయింతర్వాత సారధి తనే "యేదైనా చెప్పు" అన్నాడు.

''ఏం చెప్పను.'' అమాయకంగా అడిగింది జయంతి.

"ఏదైనా సరి. మాట్లాడు. మూగ దానిలా నిశబ్దంగా కుర్చోకు."

జయంతి మాట్లాడ లేదు.

"నీ చిన్నతనం గురించి యేదయినా చెప్పు.'' అన్నాడు సారధి. జయంతి బుగ్గల్లోకి రక్తం పొంగింది. ''చిన్నతనం ప్రత్యేకంగా గుర్తుపెట్టుకో తగినంత గొప్ప జీవితం కాదునాది."

"గొప్ప జీవితం అంటే?" సారధి మధ్యలోనే రెట్టించాడు. అతనికా పళంగా జయంతిని తీసుకుని యెక్కడికైన దూరంగా పారిపోవాలనిపిస్తోంది. ఈరోజే తనని తను గుర్తించుకున్నట్టు తోస్తోంది.

''గొప్ప జీవితాలంటూ యేవీలేవు జయంతీ! అన్నీ ఒకటె. కాని పరిసరాలు కొన్ని జీవితాలకి ప్రత్యేకతని ప్రసాది

స్తాయి అంతే.'' సారధికి హఠాత్తుగా కారు ఆపి జయంతిని దగ్గరకు తీసుకోవాలనిపించింది. కాని నిగ్రహించుకున్నాడు. అతనికీ రోజు జీవితం అంటే యేమిటో స్పష్టంగా తెలుస్తోంది. ఈ రోజే గాదు. జయంతి మొట్టమొదట ఆఫీసులో అడుగుపెట్టినప్పుడే తెలిసింది. అమూల్యాని చేసుకుని తను డబ్బు, సంఘంలో హోదా, సాటివాళ్ళలో పరువుప్రతిష్ఠలు పొందగలిగాడు. కాని ఆ పొందటం కోసం తన జీవితంలో యెంతవిలువైంది పణంగా పెట్టాడో యిప్పుడు అర్థం అవుతోంది. ఒకదాన్ని పొందటంకోసం యింకోటి పోగొట్టుకున్న మనిషి తను. జయంతి పరిచయం సారధికి తను పొందినదానికంటె పోగొట్టుకున్నది యెక్కువ అని తెలియజెప్తోంది. తన కన్నీ వున్నట్టు అనిపిస్తుంది. కాని స్వతంత్రం యేది? అమూల్య అంగీకారం కాందీ తను యే ఒక్క చిన్నపనైనా చెయ్యగలడా!

"వానవచ్చేట్టుంది." ఆలోచనమధ్య కొట్టుకుపోతున్న సారధిని జయంతి కంఠం యీలోకంలోకి తెచ్చింది.

అవును. గాలిలో చల్లదనంతోపాటు తేమగూడా తెలుస్తోంది.

"భయమా!" జయంతివైపు తల తిప్పిచూస్తూ అడిగాడు.

"చాలా దూరం వచ్చేస్తున్నాం." మనసులోకలిగిన భయాన్ని దాచుకోటానికి ప్రయత్నిస్తూ అంది జయంతి. కళ్ళెందుకో సారధి 20 సం॥ వయసు తగ్గినట్టు అన్పిస్తోంది.

''ఫర్వాలేదు. నీకేం జరక్కుండా యింటికి జేర్చే బాధ్యత నాది అని చెప్పలేదు?'' కారు ఆపి పూర్తిగా జయంతి వైపు తిరుగుతూ అన్నాడు.

''వద్దు. వద్దు కారు ఆపద్దు. వెళ్ళిపోదాం.'' ఖంగారుగా అంది జయంతి. తనెప్పుడు యిలా వచ్చివుండకూడదు. తెలియకుండా అనాలోచితంగా వచ్చినందుకు భగవాన్! నా కెలాటి శాస్తి చెయ్యకు. ఇంకెప్పుడు యిలా ఒంటరిగా రాను జయంతి మనసులో భగవంతుడ్ని ప్రార్థించసాగింది. గాలి వేగం యెక్కువైంది. టపటప చినుకులు రాలటం మొదలు పెట్టాయి. క్షణంలో కాటుకలా చీకటి ఆవరించుకుంది. దూరంగా ఆకాశంలో వుండి వుండి మెరుపులు కన్పిస్తున్నాయి. వాన జోరుగా ప్రారంభమైంది. స్టీరింగ్ మీద మోచెయ్యి ఆన్చుకుని అరచేతిలో గడ్డం పెట్టుకుని సారధి వానవైపు చూస్తుండిపోయాడు.

''వెళ్ళిపోదాం. ప్లీజ్.'' నూతిలోంచి మాట్లాడుతున్నట్టుగా అంది జయంతి. సారధి సంస్కారపూరితమైన హృదయంమీద వున్న నమ్మకం సడలిపోసాగింది. శరీరంలో ప్రతినరం భయంతో బిగుసుపోసాగింది. తనెప్పుడు యిలా యింతరాత్రప్పుడు వచ్చివుండకూడదు.

భయంతో ముడుచుకుపోయిన జయంతిని క్షణంసేపు పరిశీలనగా చూసిన సారధి జయంతిని తాకాలనిపించినా తాకకుండానే "భయపడకు. నాకెలాగో అన్పిస్తుంది. ఇదుగో స్టార్ట్ చేస్తున్నాను." అన్నాడు. స్టార్ట్ చేస్తూ. గాలిలో బలం, వానలో జోరు రెట్టింపయినాయి. కారు ముందు ప్రసరిస్తున్న హెడ్ లైట్ల కాంతి పడ్డమేర వర్షపుధారలు పూసల తోరణాల్లా మెరుస్తున్నాయి.

సారధి హఠాత్తుగా చెయిజాపూ "జయంతీ! నీకేదో చాలా చెప్పాలని పిస్తోంది. నువ్వనవసరంగా భయపడ్తున్నావు" అన్నాడు.

"ఇప్పుడొద్దు. యింకోసారి యెప్పుడైనా -"

"కానీ జయంతీ!" కుడిచేత్తొ డ్రైవ్ చేస్తున్న సారధి యెడంచెయ్యి చాచి జయంతి చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. అప్పుడే మలుపు వచ్చింది. గబుక్కున మలుపు తిప్పినసారధి స్టీరింగ్ని కంట్రోల్ చెయ్యడంకోసం రెండోచేతిని గూడా గబుక్కున తీసుకోబోయాడు. అప్పటికే ఆలస్యం అయిపోయింది. అవతల నుంచి వేగంగా వస్తున్న కారు ఒకటి బలంగా ఢీకొట్టుకోబోయి సడన్ బ్రేక్స్తో యెగిరి ప్రక్కనున్న చెట్టును రాచుకుని కీచుమంటు ఆగిపోయింది. హఠాత్తుగా ప్రమాదం తప్పించడంకోసం ప్రక్కకు తిప్పేసిన సారధి స్టీరింగ్ని కంట్రోలు చెయ్యలేక పోవటంతో ప్రక్కకుతిరిగిపోయి మరోచెట్టుని బలంగాగుద్దుకుంది.

"మైగాడ్! యీ పెధవ్వానలో!_" అవతల కారులోంచి కాస్తలో ప్రమాదం తప్పించుకున్న వ్యక్తి యివతలకుదిగి యీ కారువైపు పరుగెత్తుకొచ్చాడు. అతను కారు చేరుకోక ముందే రోడ్డు కడ్డంగా బోర్ల పడిన సారధి కన్పించాడు. "పీడవాన! యెప్పుడూ యేదో ఒకటి నా ప్రాణానికి తెస్తూనే వుంటుంది." తిట్టుకుంటు సారధిమీదకు వంగి పరీక్ష చేయబోతుండగా సారధే ఒకసారి బలంగా మూలిగి ప్రక్కకు తిరగబోయాడు. నయమే చచ్చిపోలేదు. అదృష్టం.— "సారధికి ప్రక్కకు తిరగటానికి సాయం చేస్తూ అనుకున్నాడు.

"అబ్బా!" మరోసారి వెల్లికిలా తిరిగిన సారధి యింకోసారి మూలిగాడు.

"యెవరూ! మైగాడ్ సారధి! ఈ వేళప్పుడు యిక్కడేం చేస్తున్నట్టు."

శేఖరం ఆశ్చర్యపోయి యింకోసారి పరీక్ష చేయబోతుండగా సారధి లేచాడు. అనుకోకుండా జరిగిన యీ సంఘటనకి అతని మనసు దిమ్మెర పోయింది. అంత బలమైన దెబ్బలు తగల్లేదు.

"శేఖరం!" సారధి తెల్లబోతూ అన్నాడు.

"నీకంటె నేనే యెక్కువ ఆశ్చర్యపోతున్నానని చెప్తున్నా. ఈ పాటికి

భోంచేసి హాయిగా పరుపుమీద నిద్రపో వలసిన నువ్వు —"

శేఖరం వాక్యం పూర్తి చెయ్యకుండానే సారధి వులిక్కిపడిన వాడిలా చుట్టూ చూస్తూ "జయంతి. జయంతేది" అన్నాడు.

"జయంతా! యెవరావిడ? నీకు పూర్తి స్పృహ వచ్చినట్టు లేదే?" అన్నాడు శేఖరం. గబుక్కున ముందుకు వెళ్ళబోయిన సారధి కాలుపట్టుకుని 'అబ్బా' అంటూ ఆగిపోయాడు.

"ఏమైంది! దెబ్బ తగిలిందా?" శేఖరం ఆత్రంగా వంగి కాలు చూడబోతూ అన్నాడు.

"నా కాలు వదిలెయ్యి. నాతో కారులో యింకో అమ్మాయి వుంది. యేది?"

"ఏది?" శేఖరంగూడా చుట్టూ చూస్తూ అడిగాడు

"అటువైపు వెళ్ళిచూడు. శేఖరం త్వరగా, లాభంలేదు నా కాలు కదల నివ్వటంలేదు," సారధి తొందరపెట్టాడు. శేఖరం కారు కటువైపు వెళ్ళాడు. వాన యింకా జోరుగానే పడ్తోంది. ముందు శేఖరానికి వానజల్లు తప్ప యేం కన్పించ లేదు. అతనికళ్ళు మరింత చురుకుతనం తెచ్చుకుని పరీక్షగా చూసింతర్వాత జయంతి.కన్పించింది.చేతులు తలమటుకు రోడ్డుమీదికి కొద్దిగా వున్నాయి. మిగతా భాగం అంతా క్రిందికివుంది. రోడ్డుమీద పడు వర్షపునీళ్ళు కాల్వలుకట్టి ప్రవాహంలా జయంతి మీదనుంచి జరజర ప్రవహిస్తున్నాయి. అదృష్టం. జయంతి ప్రక్కనే పెద్దరాయి వుంది. ఆ రాయి మీద పడలేదు. ఇంకో విధంగా రాయి అక్కడ వుండటంవల్లనే జయంతి ఆ మాత్రం వుండగలిగింది.

లేకపోతే వర్షపునీళ్ళ అడుగునపడి వునికి తెలిసేదికాదు.

శేఖరం రెండంగల్లోవెళ్ళి జయంతిని చేతులమధ్య లేవేసి కారుదగ్గిరకు తీసు కొచ్చేశాడు.

"స్పృహ వుందా?" సారధి ఆత్రంగా అడిగాడు.

"ఉన్నట్టు లేదు." శేఖరం కనుబొమలు ముడిపడ్డాయి. ఇదన్నమాట, సారధి యిక్కడ వెలిగిస్తున్న ఘనకార్యం! జయంతి నుదుటిమీద గాయం బలంగా వుంది. మోచేతిదగ్గర కూడా రక్తం వస్తోంది. పాంట్ జేబులోంచి జేబురుమాలు తీసి, జయంతి నుదుటికి అడ్డుపెట్టిన శేఖరం విసుగ్గా సారధివైపు చూస్తూ "నువ్విలా పట్టుకుని వెనక సీటులో కూర్చుంటే నేను డ్రైవ్ చేస్తాను. మనం సాధ్యమైనంత త్వరలో డాక్టర్ దగ్గరకు వెళ్ళటం మంచిది." అన్నాడు.

గబుక్కున యెక్కబోయిన సారధి చటుక్కున ఆగిపోయాడు. శేఖరం యేమిటన్నట్టు చూశాడు.

"శేఖరం! నేను సీతోరాను. కారు దగ్గర వుండిపోతాను" అన్నాడు.

శేఖరం కళ్ళు వెడల్పు అయినాయి.

"నిజం. నేనిలా వచ్చానని గాని — జయంతినాతో వుందనిగాని యెవరికీ ముఖ్యంగా అమూల్యకి తెలియకూడదు."

"అందుకని?" రెప్పవాల్చకుండా యింకా అలాగే చూస్తూ అడిగాడు శేఖరం.

"చెప్పానుగదా! జయంతిని తీసుకెళ్ళి నీకు తెలిసిన డాక్టర్ కెవరైనా చూపించు. నేనిక్కడే వుంటాను."

"ఆ కారు పాడయినట్టుంది. యెలా వస్తావు?"

"ఆ సంగతంతా నాకు వదిలెయ్యి. తెల్లవార్లూ నేనిక్కడ కూర్చున్నా ఫర్వాలేదు. అదృష్టవశాత్తూ నీలాగే యెవరన్నా వస్తే చూస్తాను. తెల్లవారేలోపల కనీసం ఒక లారీఅయినా యిటు వెళ్ళకపోదు."

శేఖరం కనుబొమలు మరింత ముడుచుకున్నాయి.

"తీసుకెళ్ళటానికి నాకభ్యంతరం లేదు. కాని జేబురుమాలు అడ్డుపెట్టి గట్టిగా నొక్కిపెట్టపోతే రక్తం మరింత పోతుంది." అన్నాడు.

"దానికి నేను వుపాయం చెప్తానుగా." సారధి అలా అంటుతూనే శేఖరం సాయంతో జయంతిని ముందు సీటులోకి తెచ్చాడు. జయంతితల శేఖరం తొడమీద వుంటుంది. యెదురుగుండా యే కారూ అడ్డురానంతవరకూ ఒకచెయ్యి జేబురుమాలుమీద వుంచి యింకోచేత్తో శేఖరం డ్రైవ్ చెయ్యొచ్చు. అప్పుడప్పుడు కాస్త చెయ్యి తీసినంతమాత్రాన యేం కాదు.

"సరె! కాని నేను మళ్ళీ వెనక్కి వస్తాను ఈలోపల నీకే కారు దొరక్కపోతె —" శేఖరం కారు స్టార్ట్‌చెయ్యబోతూ అన్నాడు.

"ఆల్‌రైట్! మర్చిపోయాను. ఆ సిగరెట్ పాకెట్ యిటు యిచ్చివెళ్ళు—" సారధి శేఖరం పెట్టె మొత్తం తీసుకున్నాడు.

డ్రైవ్ చేస్తున్న శేఖరం చేతివాచీ చూసుకున్నాడు. 12-30. ఇప్పుడే డాక్టర్ దగ్గరకెళ్ళాలి? తెలిసినవాళ్ళ దగ్గరకి వెళ్ళేందుకు వీల్లేదు. ఇంతరాత్రప్పుడు. భగవాన్! ఈరోజు లేచి ఎవరి మొహం చూశాదోకాని — యెలాటి గొడవలో యిరుక్కున్నాడు. తొడమీద నుంచి జారిపోతున్న జయంతితల సరిచేస్తూ అనుకున్నాడు. అయితె ఆ రోజు రాసిన ఆకాశరామన్న వుత్తరం నిజమే అన్నమాట. తను నమ్మనే నమ్మలేకపోయాడు. ఏం మనుష్యులు! భర్త వెనక భార్య! భార్యవెనక భర్త! ఛీ. యీ ఆఫీసుల్లో వుద్యోగంచేసే ఆడపిల్లల మటుకు? వాళ్ళ మటుకు యేం చేస్తారు. యెలాగో అలాగు చదువుకోవటం — డిగ్రీ సంపాయించుకోవటం. వుద్యోగాల్లో చేరటం. వుద్యోగాల్లో చేరగానే యేళ్ళ

జరుగుతాయి. పెళ్ళి అశ్రద్ధ అయిపోతుంది. కాబోయే భర్తకి యీ అర్హతలుండాలి అనే కోరిక పెరుగుతుంది. అవి వున్న మనిషి దొరకడు. ఈ లోపల సంవత్సరాలు దొర్లిపోవటం. యెవరో కొద్దిగా మనసుకి దగ్గరగా రావటం! వాళ్ళతో సంబంధాలు యేర్పరచుకోవటం చేస్తారు! ఆ కాలంలో బాల్య వివాహాలు చేసేస్తే భర్తలుపోయి విధవరాండ్రుగా మిగిలిపోతే యీ రోజుల్లో చదువుకుని పెళ్లిళ్ళుకాకుండా మిస్సమ్మల్లాగా మిగిలిపోతున్నారు. ఆడపిల్ల జీవితం అప్పుడెలా బాధగావుందో యిప్పు డలాగేవుంది. కాబోతే తిండికోసం వాళ్ళు యెవరిమీద ఆధారపడటం లేదు అంతే.

కారు సిటీ సమీపిస్తోంది. యిప్పుడు యే డాక్టర్ దగ్గరకెళ్ళాలి! జయంతి తడి తల పెట్టడంవల్ల సారధి పాంటుగూడా తడిసిపోయింది. వాన వుధృతం కొద్దిగా తగ్గింది. ఈ రాత్రివేళ యిలా తన తొడమీద స్పృహలేకుండా పడివున్న యీ అమ్మాయి ముక్కూ మొహం గూడా తనకి తెలియదంటె యెవరైనా నమ్మతారా? యెవరూ నమ్మరు. అందుకే కొంచం జాగ్రత్తగా తనంటే తెలియని డాక్టర్ దగ్గరకెళ్ళాలి. శేఖరం కళ్ళముందు గబగబా డాక్టర్ల లిస్ట్ తిరిగింది. ఆ! పరాంజపే అని మహారాష్ట్రియన్! ఒకసారి యెప్పుడో యెందుకో అతని దగ్గరకెళ్ళాడు. అతనికి క్లినిక్ యిల్లూ రెండూ ఒకచోటే. పెద్దవాడు గూడా. శేఖరం కారుని అటువైపు తిప్పాడు.

శేఖరం అదృష్టం. పరాంజపే యింట్లోనే వున్నాడు.

కారుహారన్ నొక్కిన రెండు నిమిషాలకే తలుపు తెరుచుకుంది. శేఖరం సాయంతో జయంతిని లోపలికి తీసుకెళ్ళి టేబిల్ మీద పడుకో పెట్టాడు

డాక్టర్ జయంతిని పరీక్షచేసి నుదుటిమీద కట్టుకట్టి ఇంజెక్షన్ చేశాడు.

"ఇప్పు డప్పుడే బహుశా మెలకువ రాదనుకుంటా!" జయంతివైపు పరీక్షగా చూసి శేఖరంతో అన్నాడు.

"అసలు మెలకువ నేది రాకుండా వుంటే సంతోషిస్తా" అనుకున్నాడు మనసులో కసిగా.

"మీకు పడకకుర్చీ తెచ్చి వేస్తాను. మీరుగూడా చాలా అలసి పోయారులా వుంది."


"నే నిక్కడుండి యేంచెయ్యాలి? యింటికి వెళ్ళిపోతాను."

డాక్టరు శేఖరంవైపు చిత్రంగా చూశాడు.

"అదే — మెలకువ రాదంటున్నారు కదా!" శేఖరం నసిగాడు.

"వస్తే రావచ్చు. మీరు లేకపోతె ఆమె కంగారు పడచ్చు."

డాక్టరు వెళ్ళి పడకకుర్చీతెచ్చి వేశాడు. శేఖరం అందులో కూలబడ్డాడు. జయంతి తలపెట్టినంతమేరా అతని పాంటు యింకా




బాగా చల్లగావుంది. వెధవగోల! తనీ గొడవలో చిక్కుకున్నా దేమిటి? శేఖరం ఆలోచన్లుహఠాత్తుగా జయంతి ఇంటివైపు తిరిగాయి. వాళ్ళు యేమనుకుని వుంటారీపాటికి! ఖర్మ! పోలీసు రిపోర్ట్ యివ్వరు గదా! లేకపోతె యిలా రాత్రిళ్ళు యింటికి రాకపోవటం అలవాటే నేమో! శేఖరం మొహం మళ్ళి కఠినంగా మారింది. ఆరోజు తను సారథిగదిలోంచి వస్తుంటే దాదాపు తనమీదవచ్చి పడబోయి 'సారీ' అన్న అమ్మాయేగదూ! ఆరోజు తనెందుకంత యిదిగ ఫీలయ్యాడు. అమాయకంగా, ఆశ్చర్యంగా, సూటిగాచూసే ఆక్క తనకి చాలా రోజులు జ్ఞాపకం వున్నాయి అన్న సంగతి శేఖరానికి గుర్తువచ్చింది. అది అమాయకత్వం యేమీగాదు. అదో రోజు. లేకపోతె బుద్ధిలేదూ! పెళ్ళయిన మనిషితో యేమిటాసాంగత్యం. శేఖరం తల తిప్పి కోపంగా జయంతివైపు చూశాడు. అతనికీ క్షణంలో జయంతి జయంతిఖర్మానికి వదిలేసి లేచ్చక్కాపోవా లనిపించింది. మళ్ళీ అమాయకంగా, విపరీతంగా అలిసిపోయి గాఢ నిద్రలోవున్న దానిలా వున్న ఆ మొహం గుర్తుకొచ్చేసరికి శేఖరం మొహం మళ్ళా ప్రసన్నం అయింది. పాపం! తను మటుకు యేంచేయగలుగుతుంది. యింట్లో పెద్దవాళ్ళని అనాలిగాని — వయసుచేసే గమత్‌లనుంచి తప్పించుకోవటం యెవరితరం! నిండా 20 సంవత్సరాలయినా వున్నట్టులేదు యింత చిన్న వయసులో అసలు వుద్యోగం చెయ్యాల్సిన అవసరం రావటమె దురదృష్టం.

పడక్కుర్చీలో కాలుమీద కాలువేసు

ూసి వెనక్కు వాలి జయంతి వైపే చూస్తున్న శేఖరం చూపులు చూస్తుండగానే రెప్పలు వాలిపోయి బరువుగా మూతలు పడిపోయినాయి.

ఎవరో పట్టి గట్టిగా కుదుపటంతో శేఖరానికి మెలకువ వచ్చింది. క్షణంసేపు అతనికి తనెక్కడుందీ అర్థంగాలేదు. కిటికీలోనుంచి తొలి వెలుగురేఖలు గది లోకి వస్తున్నాయి.

''ఆమెకు మెలకువ వస్తోంది. మీరు లేచి దగ్గరకురండి. గుర్తుపట్టగలదేమో చూద్దాం.'' పరాంజపే అంటున్నాడు. శేఖరానికి మెల్లగా యాక్సిడెంట్, జయంతి తల తనతోడమీద పెట్టుకుని తీసుకురావటం, డాక్టర్ పరాంజపే తలుపు తీయటం, మెల్లగా గుర్తు వస్తున్నాయి.

''మీకేచెప్పేది దగ్గరగా రండి.''

శేఖరం నిద్రమత్తు వదలించుకుని లేచి జయంతి దగ్గరగా వెళ్ళాడు. కళ్ళు తెరిచిన జయంతి యింకా యెక్కడో వున్నదానిలా మత్తుగాచూస్తూ "యెక్కడున్నాను. యేమిటిది'' అంది నీరసంగా. డాక్టర్, శేఖర్ని ముందుకు తోశాడు. శేఖరం నవ్వా లనుకున్నాడు కాని నవ్వు రాలేదు.

''చెప్పండి, యేమిటిది!'' జయంతి చప్పునలేచి కూర్చోబోయింది. డాక్టరు వెంటనే చెయిచాచి ఆపేసాడు. ఆకొద్ది సేపట్లోనే జయంతి కప్పుకున్న దుప్పటి జారటం ఆ వెంటనే డాక్టర్ సరిచెయ్యటం క్షణంలో జరిగిపోయినాయి. అది శేఖరం దృష్టి దాటిపోలేదు. తను యీ అమ్మాయికి బట్టలుగూడా మార్చినట్టు గుర్తు వచ్చిన శేఖరం వెంటనే తలతిప్పేసుకుని చూపులు మార్చుకున్నాడు.

"తలెందుకు యింత నెప్పిగావుంది'' చేత్తో తల తడుముకుంటూ అంది.

"తగ్గిపోతుంది." డాక్టర్ యింజక్షనిస్తూ అన్నాడు.

"ఓమ్మల్ని గుర్తుపట్టలేదు. తమాషా. స్పృహ వచ్చిందిమరి." బైటకొస్తూ అన్నాడు డాక్టర్. జయంతి తన నెందుకు గుర్తుపట్టలేదో శేఖరానికి ఒక్కడికే తెలుసు.

"రాత్రిమీరు తియ్యటంలో ఆ చీరె చించేసారు – అసలు అది పాతదిలా వుంది. యింకోటి తీసుకురండి."

శేఖరం అంతవుదాసీనంగా యెందుకున్నాడో డాక్టర్‌కి అర్థంగావటం లేదు.

డాక్టర్ ఆదేశించిన ప్రకారం శేఖరం చీరె తెచ్చాడు. జీవితంలో యేనాడు చీరెలు కొనని శేఖరం ఈరోజు రాత్రి అజాగ్రత్తగా జయంతిచీరె తీసి చింపినందుకు ప్రతిఫలంగా కొత్తచీరె కొనుక్కొచ్చాడు.

"ఇహమీరు వెళ్ళచ్చు. పనిచూసుకుని రండి. తలమీద దెబ్బ బలంగా తగిలింది. ఈరోజల్లా అలా లేవకుండా మత్తుగా వుంటేనే మంచిది." అన్నాడు.

శేఖరం సరేననిచెప్పి వెళ్ళిపోయాడు. యేంమనిషి 'ప్రమాదం లేదుగదా' అని ఒక్కసారి గూడా అడగలేదు. డాక్టర్ చిత్రంగా చూశాడు. అంతేగాదు. జయంతి పట్ల అతని చూపుల్లోని విముఖత్వం, అతని పరధ్యాన డాక్టర్‌కి యేదో అనుమానం అన్పించేలా చేశాయి.

శేఖరం యింటికెళ్ళేసరికి 11గం. అయింది. సారధి రెండుసార్లు ఫోన్ చేశాడని యింటికి రాగానే శేఖరాన్ని ఫోన్ చెయ్యమని చెప్పాడని నౌకరు చెప్పాడు.

శేఖరం ఆఫీసుకి సారధికోసం ఫోన్ చేశాడు. శేఖరం కంఠం వింటూనే సారధి "అగు. ఫోన్‌లో యేం మాట్లాడొద్దు. నేను వస్తాను. లేకపోతె నువ్వు రా!' అన్నాడు.

"నేను రాలేను. నాకు ఓపికలేదు" విసుగ్గా అన్నాడు శేఖరం.

"అల్ రైట్ నేనే వస్తున్నాను."

మరోపది నిమిషాల్లో సారధి శేఖరం యెదురుగుండా వున్నాడు. శేఖరం జరిగిందంతా చెప్పాడు.

"వాళ్ళింటి దగ్గర యేం గొడవజరుగుతోందో" సారధి అన్నాడు.

"అదే నాకు భయంగావుంది. వాళ్లేదైనా రిపోర్ట్‌యిస్తే అనవసరంగా నేనిందులో యిరుక్కోవాల్సి వస్తుంది." కోపంగా అంటున్నా శేఖరంవైపు సారధి బాధగా చూశాడు.

ఇద్దరి మధ్య మౌనం ఆవరించింది.

"శేఖరం. ఇంతసాయం యెలాగూ చేశావు. ఇంకొక్కటి చెయ్యగూడదూ!" అన్నాడు.

"ఏమిటది ?" కుర్చీలో వెనక్కు జారగిలబడి సిగరెట్ కాలుస్తున్న శేఖరం అడిగాడు.

"శెక్రటేరియట్‌లో సుందరి అని యు. డి. సి. వుంది. ఆ అమ్మాయి జయంతి ఫ్రండ్. కాస్త ఆ అమ్మాయిని కలిస్తే."

"ఆ అమ్మాయి మొహం నాకు తెలియదు. నా ముక్కు ఆ అమ్మాయికి తెలియదు."

ఇంకోసారయితె సారధి నవ్వేవాడే! యిప్పుడతను నవ్వే స్థితిలో లేడు. దాదాపు మతిపోయిన స్థితిలోవున్నాడు. శేఖరం వెళ్ళిపోయిన అరగంటకి అటువైపు లారీ వస్తుంటే అందులో వచ్చాడు. అమూల్యకి యాక్సిడెంటయిందని చెప్పాడు. కాని జయంతి, శేఖరం యివేం చెప్పలేదు. యాక్సిడెంట్ యెప్పుడైందీ తెలియని అమూల్య మనుష్యుల్ని పిలిపించి కారు కోసం పంపింది. అప్పుడే కారు బాగయిపోతోంది కూడా! సారధికి రాత్రి కళ్ళు మూతపడితె ఒట్టు.

శేఖరం కన్పించి యీ మాత్రం చెప్పిన తర్వాత అతని మనసు కుదుటపడింది.

"ఎలాగైనాసరె. సుందరికి జయంతి విషయం తెలియటం మంచిది. నే నిందులోకి అడుగు పెట్టడం మంచిదికాదన్న సంగతి నీకు తెలుసు.

"అదృష్ట వంతుడివి. నన్నిందులోకి తోసి చక్కగా ఒడ్డున కూర్చున్నావు." అనుకున్నాడు శేఖరం.

సారధి సుందరి పనిచేసే శెక్షన్ చెప్పి సుందరితో యెలా చెప్పాలో వివరించాడు. లేచి వెళ్ళబోతూ "జయంతికి బాగా స్పృహ తెలిస్తే జరిగిందానికి నేను చాలా బాధ పడ్తున్నా నని చెప్పు" అని వెళ్ళిపోయాడు.

శేఖరం బట్టలు మార్చుకుని ఫోంచేసి ఓ అరగంట రెస్ట్ తీసుకుని మళ్ళీ సుందరి కోసం బైలుదేరాడు.

"అర్జంట్ ! మీతో జయంతివిషయం మాట్లాడాలి.జయంతి యాక్సిడెంట్ అయి హాస్పిటల్లోవుంది. ఒక్క రెండు నిమిషాలు బైటికిరండి."

సంతకంలేని చీటిని సుందరి తిరగేసి బోర్లేసి మరీమరీ చూసి యింకో రెండు సార్లు చదివింది. అయినా విషయం అర్థంగాలేదు.సూపరింటెండెంట్ ని ఓఅర గంట పర్మిషన్ కావాలని చెప్పి బైట కొచ్చింది. రాత్రి వానకురిసి వెలవటం వల్లనేమో ఈ రోజు యెండ తీక్షణంగా వుంది. ఆ యెండలో పొడుగాటి కారులో శేఖరం కూర్చుని సుందరికోసం యెదురు చూస్తున్నాడు.

"మీరేనా సుందరి అంటె ?" ఫ్యాన్ వెంటవస్తున్న సుందరివైపు చూస్తూ అన్నాడు. శేఖరాని కెందుకో సుందరి మొదటి చూపులోనే నచ్చింది. అంత పొడుగు పొట్టిగాని విగ్రహం. ఓ మాదిరి లావు, చామనచాయ. మొహాన గుండ్రటి బొట్టు. పల్చటి చీరెలోంచి స్పష్టంగా కన్పిస్తున్న మంగళసూత్రాలు. మర్యాద పుట్టిపడే మొహం. తనవైపు వస్తున్న శేఖరాన్ని చూసి సుందరి ఖంగారుపడింది. జరిగిందంతా శేఖరం క్లుప్తంగా 5 నిముషాల్లో చెప్పాడు. రెప్పవాల్చటం వూపిరి పీల్చటం మర్చిపోయి శేఖరం మొహం లోకి చూస్తు అలాగే నిలబడిపోయింది సుందరి.

"మీరు వస్తానంటె తీసుకువెడ్తాను. సాధ్యమైనంత త్వరలో దయయుంచి నా భుజాలమీదనుంచి యీ భారం దిగాలంటే దానికి మీ రొక్కరే సమర్థులు." మొఖాన పటిన చెమట తుడుచుకుంటు గబగబా అన్నాడు శేఖరం.

"ఒక్క నిమిషం వుండండి. శెలవు పెటేసి వస్తాను." సుందరి మళ్ళీ ఆఫీసు లోకి పరుగెత్తింది. చెప్పినట్టుగానే సుందరి బైటికొచ్చి శేఖరం కారులో కూర్చుంది.

ఇద్దరూ యేం మాట్లాడలేదు. 15 నిముషాల్లో కారు డా॥ పరాంజపే అని బోర్డున్న యింటిముందువచ్చి ఆగింది. ఇద్దరూ దిగి లోపలికి వచ్చారు.

ముందుగదిలోనే యెదురైన డాక్టర్ శేఖరాన్ని పలకరిస్తూ నర్స్ వచ్చిందని పేషంట్‌ని పైకి మేడమీద గదిలోకి మార్చామని ఫర్వాలేదు కులాసాగానే వుంది. కాఫీగూడా తాగింది యిప్పుడే అని చెప్పాడు.

సుందరిని యేమని పరిచయం చెయ్యాలో తెలియని శేఖరం జయంతి అక్క అని చెప్పాడు.

డాక్టర్ చూపించిన దోవని అనుసరిస్తూ సుందరి, శేఖరం మేడమెట్లు యెక్కారు. సుందరి ముందుగా నర్స్ చూపించిన గదివైపు పరుగెత్తింది. శేఖరం బైట వరండాలో ఆగిపోయాడు. గుమ్మానికి ఆకుపచ్చటి కర్టెన్ వేళ్లాడుతోంది.

"జయా !"

"సుందీ !" జయంతి బావురుమంది. సుందరి సముదాయిస్తోంది. పాంటు జేబులోంచి సిగరెట్ తీసుకుని వెలిగించుకుంటున్న శేఖరం తను సుందరి వెనక గదిలోకి వెళ్ళకపోవటం మంచిపని చేసాననుకున్నాడు.

"సుందీ ! నే నసలు బ్రతికున్నానా !" జయంతి వెక్కి వెక్కి యేడుస్తూ అడిగింది. శేఖరానికి నిజంగా జాలి అనిపించింది.

"ఫర్వాలేదు, యింకా అదృష్టవంతురాలివిగదూ !"

జయంతి తలని మెల్లగా దెబ్బకికట్టిన కట్టు కదలకుండా గుండెలకి దగ్గిరగా లాక్కుంటూ అంది.

"నన్నిక్కడికి అసలు యెవరు తీసుకొచ్చారు ? ఈ చీరెగూడా నాదిగాదు."

"బహుశా డాక్టరిచ్చివుంటాడులే. వానలో తడిసావుగదా !"

సుందరి కంఠం విన్పించింది. శేఖరం చేతిలో సిగరెట్ దూరంగా విసిరేసి క్రిందకు దిగి వచ్చేసాడు.

చాలా సేపయిన తర్వాత సుందరి దిగి వచ్చింది. రాత్రికి అవసరం అయితే శేఖరానికి ఫోన్ చెయ్యటంకోసం డాక్టర్ శేఖరం ఫోన్ నెంబరు తీసుకున్నాడు.

సుందరిని యింటిదగ్గరకు తీసుకొచ్చి వదిలేసాడు శేఖరం. దిగి వెళ్ళిపోబోతున్న సుందరిని హఠాత్తుగా ఆపి "మరి వాళ్ళ యింటి దగ్గిర" అన్నాడు. "అదంతా నేను చూసుకోగలను. రేపు మటుకు మీరు శ్రమ అనుకోక వచ్చి అక్కడికి తీసుకెడే చాలు. ఆ సందులు గొందుల్లో ఆ డిస్పెన్సరీ గుర్తుపట్టటం కష్టం." అంది నవ్వుతూ.

"అబ్బే! రేపుసరిగ్గా యీ టైమ్‌కు నేను వచ్చి తీసుకెడ్తాను. ఒక్కడ్ని అంతే భయమేస్తుందిగాని- పంచుకునేవాళ్లుంటే యెంతబరువైనా మోయగలను." శేఖరం నవ్వుతూ వీడ్కోలు తీసుకున్నాడు.

సుందరికి యింటిదగ్గర అత్త, మామ, కొడుకు వున్నారు. భర్త గూడా యేదో ఆఫీసులో పనిచేస్తున్నాడు. సుందరిని చూస్తుంటే యెలాటివాళ్ళుగూడా తమ బాధలు మర్చిపోయి హాయిగా నవ్వేయ్య గలరేమో అన్పించింది శేఖరానికి.

సారధికి సుందరి సంగతంతా చెప్పాలని యింటికెళ్ళేసరికి యింటిదగ్గర యెవరూలేరు. సారధి, అమూల్య కలిసి యెక్కడో డిన్నరుందని వెళ్ళారుట. శేఖరానికి హఠాత్తుగా గుర్తుకువచ్చింది. లాయర్ ప్రేమ్‌చంద్ యింట్లో, యీ పూట తనుకూడా తప్పనిసరిగా హాజరవాల్సిన పార్టీ. బిజినెస్ దృష్ట్యా అది చాలా ముఖ్యమైంది గూడాను. శేఖరం వాచీ చూసుకున్నాడు. అప్పటికే చాలా ఆలస్యమైపోయింది. ఒళ్ళుమండిపోయిన శేఖరం సారధిని తిట్టుకుంటూ యింటికి వచ్చేశాడు.

మర్నాడు సుందరితోపాటు జయంతి బామ్మ, మరో 8 సంవత్సరాల ఆడపిల్ల వుంది. ఆ అమ్మాయి జయంతి అక్క కూతురని, జయంతిఅక్క యీపిల్ల పుట్ట గానే పురుట్లోనే చనిపోయిందని, బావగారు యింకోపెళ్ళి చేసుకోవటం వల్ల అక్కకూతుర్ని తనదగ్గరే అట్టే పెట్టుకుందని చెప్పింది. కుటుంబం గడవటం జయంతి వుద్యోగంమీదనే ఆధారపడి వుంది. 20 సం॥ నిండీనిండన ట్టున్న జయంతి త్వరత్వరగా చదువు ముగించుకుని వుద్యోగంలో యెందుకు ప్రవేశించిందీ శేఖరానికి యిప్పుడు అర్థమైంది. ఆనాటి పరిస్థితుల్లో బాధ్యత తెలియకుండా ఒళ్ళుమరచి సారధితో సాంగత్యం కలుపుకున్నందుకు మరు క్షణంలో ఒళ్ళు మండిపోయింది గూడా.

సుందరి జయంతి బామ్మకి యేమని చెప్పిందో ఆ భగవంతుడికే తెలుసు. శేఖరం వూహించినట్టు ఆవిడ జయంతిని చూస్తూనే గందరగోళం చెయ్యలేదు. కళ్ళంబడి నిశబ్దంగా నీళ్ళు పెట్టుకుంది. భయపడద్దని మనమరాలికి ధైర్యం చెప్పింది, అంతే.

సుందరి, బామ్మ, పాపతో బాటు లోపలికి వచ్చిన శేఖరాన్ని చూసి జయంతి తెల్లబోయింది. ఒళ్ళు వెడల్పు అయినాయి.

"మీరు—మీరు—" సారధి బహుశా పంపివుంటా డనుకుంది. శేఖరాని క్షేమని చెప్పాలో తోచలేదు. సుందరి సమస్య పరిష్కరిస్తూ యాక్సిడెంట్ అయినప్పుడు శేఖరం అక్కడే వున్నాడని, జయంతిని హాస్పిటల్‌కి తీసుకు వచ్చింది కూడా ఆ నేనని జయంతికి సరిగ్గా అర్థమయేలా, బామ్మగారు మరో రకంగా అర్థం చేసుకోకుండా వివమర్చి చెప్పింది.

మరో సారి జయంతి చూపులు శేఖరం చూపుతో కలిసి ఆగిపోయి నాయి—అవే చూపులు. అదే అమాయకత! శేఖరం ఆ కళ్ళలోకి చూడటం యిష్టం

లేదన్నట్లు ప్రక్కకు తిప్పుకున్నాడు. అతను తిప్పుకునే లోపలే జయంతి చూపులు క్రిందికి వాలిపోయినాయి. తనని గురించి అత నెంత అసహ్యంగా ఆలోచించి వుండొచ్చు! కాని ఆసమయంలో అతను — ప్రత్యేకంగా శేఖరం రావటం యెంత అదృష్టం.

శేఖరం ప్రత్యేకించి జయంతితో ఒక్క మాటగూడా మాట్లాడ లేదు. రెండు గంటలు కూర్చున్న తర్వాత అంతా వెళ్ళిపోయారు.

మర్నాడు యెవరూ రాలేదు. మూడో రోజు బామ్మ, పాపని శేఖరం కారులో తీసుకు వచ్చాడుగాని, అతనసలు పైకి రానేలేదు. సుందరికి ఆఫీసులో యినస్పెక్షన్ జరుగుతుందిట.

నాలుగో రోజున—మధ్యాహ్నం దాటి పోతుండగా గోడకి చేరగిలబడి పరధ్యానగా ఆలోచిస్తున్న జయంతి, పాదాలు చప్పుడు అవటంతో ప్రక్కకు తిరిగి చూసింది. వచ్చింది శేఖరం! ఓ చేతిలో ప్లాస్టిక్ బాగ్‌నిండా పళ్ళు. ఇంకో చేతి నిండా పుస్తకాలు వున్నాయి.

"మీపాపకి జ్వరంవస్తోందిట. బామ్మ గారు అందుకని రాలేదు. పళ్ళ బుట్ట టేబుల్‌మీద పెట్టూ అన్నాడు.

"పాపకి జ్వరమా!" కళ్లుతిప్పి శేఖరంవైపు చూస్తూ అంది.

"అవును. ఇవిగో! మీకు కాల క్షేపానికి పుస్తకాలు."

పుస్తకాలు మంచంమీద పెట్టి ప్రక్కనున్న కుర్చీలో కూర్చుంటూ,

"ఈరోజు యెలా వుంది?" అని అడిగాడు.

ఇద్దరి కళ్లు ఏ బుసుకున్నాయి. జయంతిచూపులు క్రిందకు వాలిపోయినాయి.

"మీ ఋణం జన్మలో తీర్చుకోలేను" అంది.

"అది నాప్రశ్నకు జవాబుగాదు," తల వంచుకున్న జయంతివైపు పరీక్షగా చూస్తూ అన్నాడు శేఖరం. రక్తం పోవటంవల్లనేమో మొహం తెల్లగా పాలిపోయినట్టుగా వుంది. బుగ్గలమీద కండ తగ్గిపోయి ఎముకలు కొద్దిగా కన్పిస్తున్నాయి. వంచుకున్నతల ప్రక్కనుంచిచూస్తే చక్కటిబొమ్మ వేయటం కోసం ముందు ముఖ్యమైన గీతలు అందంగా గీసినట్టుంది.

ఇద్దరి మధ్య నిశ్శబ్దం యేర్పడింది.

"కాలు యెలావుంది? నడవనిస్తోందా!" యాక్సిడెంట్ అయినప్పుడు బోర్లా పడడంలో కాలు మెలికపడి పోవటమే గాక బొటనవేలుకి పైన పాదంమధ్యగా బలంగా గాయం తగిలింది.

"మెల్లగా నడిస్తే నొప్పి అన్పించటం లేదు. కాని యెక్కువసేపు నిలబడ నివ్వటంలేదు." పాదంవైపు చూసుకుంటూ అంది.

"మొహంమీద దెబ్బ."

"తగ్గిపోతోంది."

"యేదీ?" శేఖరం లేచివచ్చి జయంతి మొహంమీద గాయం పరీక్షచేశాడు.

"నే నింకా యీ హాస్పిటల్లో యెన్ని రోజు లుండాలి?"

"15 రోజులకి పైనేగాని తక్కువగాదు. యేం?" జయంతి గడ్డాన్ని యెడం చేత్తో యెత్తి కుడిచేత్తో మొహంమీద పడిన జుట్టుతప్పించి మరింతగా పరీక్ష చేస్తూ అన్నాడు.

ఇంకా పదిహేనురోజులా! యింటి దగ్గర పాపకి జ్వరం. బామ్మ ఒక్కర్తీ! ఆ ఆలోచన గుర్తుకు వస్తూనే జయంతి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. హఠాత్తుగా తిరిగిన యీ కన్నీళ్ళని వేరొక విధంగా అర్థం చేసుకున్న శేఖరం వాటిని మెల్లగా తుడుస్తు "మనకు తెలిసినంతవరకూ యే సంఘటన లోనూ చిక్కుకోకుండా జాగ్రత్తపడాలి. ఒకవేళ చిక్కుకుంటే ధైర్యంతో వాటిని దాటాలి. అంతేగాని—" అతనికి తెలియకుండానే కంఠం మృదువుగా మారింది. కుడిచెయ్యి చిక్కిపోయిన జయంతి బుగ్గల్ని ఆప్యాయతగా నిమిరింది.

"సారీ! శేఖరం" గుమ్మందగ్గర చిన్న దగ్గుతోపాటు మాటగూడా విన్పించడంతో శేఖరం జయంతి యిద్దరూ వులిక్కిపడి వెనక్కు తిరిగారు. వచ్చింది అమూల్య!

"కూడని సమయంలో వచ్చినట్టున్నాను. ఊఁ! అయితే యీవిడన్నమాట నీ పేషెంట్. వస్తాను." మరీ మాటకి అవకాశం యివ్వకుండా అమూల్య గిరుక్కున వెనక్కు తిరిగి వెళ్ళిపోయింది.

"అమూల్యా." శేఖరం తెల్లబోయాడు.

"ఆవి డిక్కడి కెందుకువచ్చింది —" అందులో శేఖరం చేతుల్లో తనమొహం! జయంతికి భయంతో ఒంట్లో రక్తం మంచుగా మారిపోయింది.

"ఇప్పుడే వస్తాను" జయంతివైపు చూడకుండానే శేఖరం వెళ్ళిపోయాడు.

తనకి యాక్సిడెంట్ అయినట్టు యిక్కడున్నట్టు యెవరికీ తెలియదని సుందరి చెప్పింది! భగవాన్! మరి యీవిడెలా వచ్చింది? శేఖరాన్ని నీ పేషెంటా అంటుందేమిటి! యింకా నా మొహాన యేం రాసి పెట్టివుంది భగవంతుడా! నేను యేం చేసానో - జయంతి దిండులో తల దాచుకుని వెక్కివెక్కి యేడవసాగింది.

శేఖరం క్రిందికి దిగివచ్చేసరికి అమూల్య డాక్టర్ దగ్గర నిలబడివుంది. శేఖరాన్ని చూస్తూనే "సారీ! శేఖరం. నేను జయంతి అనుకోలేదు" అంది.

"ప్లీజ్! నువ్వేం మాట్లాడొద్దు. యిక్కడనుంచిముందు వెళ్ళిపోదాంపద." శేఖరం బైటకు దోవతీస్తూ అన్నాడు.

తెలుగురాని డాక్టరుకి వాళ్ళిద్దరూ మాట్లాడుకునే దేమిటో అర్థంగాలేదు.

ఇద్దరూ వెళ్తుండగా. నిశబ్దంగా.



నిశ్చలంగా డ్రైవ్ చేస్తున్న శేఖరంవైపు చూస్తూ "జయంతికీ నీకూ అసలు పరిచయం వుంటుందన్న ఊహే నాకు రాలేదు. క్లబ్‌లో అందరూ యేదో యాక్సిడెంట్ అయిందని, నువ్వు ఆ పేషెంట్‌ని రహస్యంగా దాచావని, ముఖ్యంగా పేషెంట్ అమ్మాయి అని అందరూ చెప్పుకుంటే కుతూహల మనిపించి వచ్చాను." అంది అమూల్య.

యేం చెప్పాలో తోచని శేఖరం మరింత నిదానంగా డ్రైవ్ చెయ్యసాగాడు. మళ్ళీ అమూల్య తనే "నాకు నిజంగా చాలా చిత్రంగా వుంది" అంది.

"జయంతిని చూసా!"

"అవును."

"క్లబ్‌లో అందరికీ పేషెంటెవరో తెలుసా!"

"తెలిసినట్లే వుంది. అయినా నువ్వింతగా అందులో దాచుకోవల్సింది యేముంది!"

"మీ రందరూ యీర్ష్యపడి నన్ను దూరంగా పెట్టేస్తారేమోనని భయంవేసి—" శేఖరం నవ్వుతూ కావాలనే అన్నాడు.

అమూల్య చురుగ్గా కోపంగా చూసింది.

విషయం దూరం పోతుందని గ్రహించిన శేఖరం...

"అమూల్యా! సారధి నీకేం చెప్పలేదా?" అని అడిగాడు.

"నాకా! నాకు చెప్పే దేముంది?"

"సారధి చెప్పేదేం లేదేమో. కాని నేను చెప్పాల్సింది చాలా వుంది. ఇక్కడే కొంచంసేపు కారు ఆపుతాను."

కారు ట్యాంక్‌బండ్ మీదకు రావటంతో ఓ ప్రక్కగా ఆపుతూ శేఖరం చెప్పటం మొదలు పెట్టాడు.

'జబష్టం –' వ్రాసిన వినబడుతుంది వింటున్న అమూల్య కోపంగా అంది.

"అలా అని నువ్వు అనుకుంటే నాకు అభ్యంతరం లేదు. కాని క్లబ్‌లోనూ, తెలిసినవాళ్లు – నీకు తెలుసుగదా. చాలా రోజులనుంచి నా ప్రవర్తనలో యేం లోపం దొరుకుతుందా, కథలు ప్రచారం చేద్దామా అని యెదురుచూస్తున్న కొంతమందికి మంచి అవకాశం. కాని యిప్పుడు నాకు తెలుస్తోంది. మీ కుటుంబం గౌరవ మర్యాదలు కాపాడటంకోసం, సారధి పేరు ప్రతిష్ఠలు పాడవకుండా వుండేందుకు మంచి చెయ్యబోయిన నేను మరోవిధంగా నాకు నేను నష్టం చేసుకున్నాను. కావాలంటే నువ్వు సారధిని గట్టిగా అడిగిచూడు. అంతేగాని జయంతితో నా కెలాంటి సంబంధంలేదు. దీనికి నువ్వేం రంగులు పూయకు." కారు స్టార్ట్ చేస్తూ అన్నాడు శేఖరం.

ఆ రోజు రాత్రి పొద్దుపోయినతర్వాత పడుకున్న శేఖరం యెవరో తట్టి లేపి నట్టు అన్పించటంతో ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. యెవరూ లేపలేదు. కాని హాల్లో ఫోన్ గణగణా మోగుతోంది. శేఖరం విసుక్కుంటూ లేచి వెళ్ళాడు.

"హలో!"

"హలో! శేఖరంగారేనా!"

"అవును."

"నేను డాక్టర్ పరాంజపేని మాట్లాడుతున్నా. పేషెంట్ కండిషన్ బాగాలేదండీ! సాయింత్రానికి టెంపరేచర్ వచ్చింది. మీ రొకసారి వస్తే బాగుంటుంది. దగ్గర యెవరైనా వుండాలి. మా కింకో కేసు రావటంతో నర్సు, నేను బిజీగా వున్నాం."

"వస్తున్నాను నేను."

"థాంక్స్." డాక్టర్ పెట్టేసాడు.

క్షణంసేపు ఆలోచించిన శేఖరం బట్టలేసుకుని బైట కెళ్లాడు. 10 ని॥ల్లో డిస్పెన్సరీముందు వున్నాడు.

"సారీ! ట్రబులిచ్చిన ట్టున్నాను. మీరు పైకి వెళ్ళండి."

ఇంతలో అర్జంట్ కేసుని చూస్తున్న డాక్టర్, శేఖరానికిచెప్పి వెళ్ళిపోయాడు.

శేఖరం రాగానే అంతవరకూ జయంతిని పట్టుకొన్న నర్సు క్రిందకు వెళ్ళిపోయింది. జయంతి స్పృహలోలేదు. వూరికే యేడుస్తోంది. యేవేవో మాట్లాడ్తోంది.

సుందీ! నేనేం తప్పుచెయ్యలేదు, చెయ్యలేదు. కనీసం నువ్వయినా నమ్ము. అంటోంది. కాసేపు బొమ్మ యెట్లా — పాపకి జ్వరం. డాక్టర్ మందివ్వండి; అంటోంది. యింకొంచెంసేపు వూరికే వెక్కి-వెక్కి యేడుస్తోంది.

కుర్చీలో కూర్చున్న శేఖరం లేచి మంచంమీదకొచ్చి కూర్చుని, జయంతిని చేతులమధ్య తీసుకుని 'జయంతీ — జయంతీ' అని పిలిచాడు, జయంతి సమాధానం యివ్వలేదు. అసలేమిలాగో వుంది మానసికంగా చాలా బలహీనంగా వున్న జయంతి అనుకోకుండా అమూల్యని చూడటంతో ఖంగారుపడిపోయి బెదిరిపోతోంది అని. జయంతిమీద మొట్టమొదటి సారిగా నిజంగా జాలేసింది శేఖరానికి.

తెల తెలవారుతుండగా డాక్టర్ "యెలావుంది" అంటూ పైకి వచ్చాడు. తనచేతులమధ్య యేడ్చియేడ్చి అలిసిపోయి వాడిపోయినట్టున్న జయంతిని నిశ్శబ్దంగా డాక్టర్కి చూపించాడు శేఖరం.

"నిద్రకి మాత్ర లిచ్చినా నిద్రపోలేదు. ఈరోజు యేమైందో? యేదోషాక్ తిన్నట్టు ఫీలయిందిలా వుంది." జయంతి చేయి తీసుకుని నాడిపరీక్షచేస్తూ అన్నాడు డాక్టర్.

తూర్పున తెలతెలవారుతోంది. గది లోకి వస్తున్న వెలుతురివైపు నిద్రలేని కళ్ళతో చూస్తున్న శేఖరాని కెందుకో జయంతి తన జీవితంతో ముడివేసుకుపోయిందని, బైటకి బలవంతంగా తోసెయ్యాలంటే చాలాబలం కావాలని అనిపించింది.

మరీవారం రోజులు గడిచిపోయినాయి. జయంతి నుదిటిమీద గాయం

యెవ్రటిమచ్చలాతయారైంది కాలుగూడా తగ్గి నడవనిస్తోంది. రోజూ రెండుపూటలా శేఖరం వచ్చి చూసి వెడుతున్నాడు.

ఓరోజు శేఖరం వచ్చేసరికి జయంతి మంచంమీద లేదు. శేఖరం కళ్ళుతిప్పి గదిలో అటుయిటు చూసాడు. దూరంగా కిటికీదగ్గర నిలబడి బైటకు చూస్తోంది.

"అయితే ఫర్వాలేదన్నమాట" తృప్తిగా చూస్తూ అన్నాడు శేఖరం. వెనక్కి తిరిగిన జయంతి మెల్లగా వచ్చి మంచంమీద కూర్చుంది.

"ఏమైంది? అలావున్నావేం?" ఆదుర్దాగా అడిగాడు శేఖరం. జయంతి మొహంలో బొత్తిగా రక్తంలేదు. ఈ కొద్దిరోజుల్లోనే యిద్దరి పరిచయం యెక్కువైంది. జయంతి ప్రక్కగా పడివున్న పుస్తకంలోనుంచి ఓకవరుతీసి శేఖరానికిచ్చింది. అది సరైన లీవ్ లెటర్ యివ్వనందుకు, ఆఫీసులో పనిమీద గూడా సరైన శ్రద్ధలేనందుకు జయంతిని వుద్యోగంలోనుంచి తీసేస్తున్నట్టు పూస్టింగ్ ఆర్డర్.

శేఖరం తలెత్తి జయంతివైపు చూసాడు. "నన్నింకా భగవంతుడు పరీక్ష చేస్తున్నాడు. కాలునయం అయిపోతోంది అంటె యింకోసమస్య—నేనసలు బ్రతికివుండటమే అడుగడుగునా శాపంలా అనిపిస్తోంది." జయంతి హఠాత్తుగా ప్రక్కకుతిరిగి మోచేతి ఒంపులో మొహం దాచుకుని వెక్కి వెక్కి యేడవటం మొదలుపెట్టింది. మళ్ళీ వుద్యోగం దొరకాలంటే యెంతబాధ. యెన్నిచోట్ల తిరగాలి! యీలోపల యేం తినాలి!

తన భుజంమీద చెయి పడటంతో జయంతి తలతిప్పి చూసింది. యెదురుగుండా శేఖరం. జయంతి ప్రక్కగా మంచంమీద కూర్చుంటూ "సారధి తొందరపడ్డాడు. నాలుగు రోజులుంటే నువ్వే రాజీనామా పంపివుండేదానివి. అయినా సారధంత హృదయం లేని మనిషి అని నేనింతవరకూ అనుకోలేదు."

"నేనెలా రిజైనిచ్చేదాన్ని—" కళ్ళు పెద్దవిచేస్తు అడిగింది.

"తప్పకుండా — నీకెలా చెప్పాలో నాకు తెలియటంలేదు జయంతి. సుందరి యీ సాయంత్రం నీకోవార్త చెప్పటానికి వస్తుంది."

"ఏమిటది?"

"నేను నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నానని —"

జయంతి కళ్ళలోకి మొహంలో మారబోయే భావాలని జాగ్రత్తగా పరిశీలిస్తూ అన్నాడు.

జయంతి క్షణంసేపు వెర్రిగా చూసింది. మరుక్షణంలో మొహం యెరుపురంగుకు తిరిగింది. శేఖరాని కది



చాలనిపించింది. "తమాషాకిది సమయం గాదు'' అంది.

"తమాషాగాదు జయంతీ, యిప్పటికే క్లబ్‌లో అక్కడా అంతా యీ యాక్సిడెంట్‌ను గురించి నానారకాలుగా అనుకుంటున్నారు."

"ఏమని ?" -

"నేను నిన్ను బైట తీసుకెళ్ళే సారధి కారుతో యాక్సిడెంట్ అయితే - సారధి యెవరితో యీ విషయం చెప్పొద్దని బ్రతిమలాడి నిన్ను రహస్యంగా యీ హాస్పిటల్‌కి తీసుకొచ్చి వుంచాడని."

"ఎంత అబద్ధం!"

"ఆ అబద్ధమే నిజంకాని. అందుకే మనవాళ్లు పదుగురాడుమాట..అంటారు"

"అందుకని _" జయంతి శేఖరం వైపు అనుమానంగా చూస్తూ అంది.

"వాళ్ళమాటే నిజంచేసి నిన్ను పెళ్ళి చేసుకుంటున్నాను" జయంతి భుజాలు చుట్టూ చేయివేసి ఒక చేత్తో తలనిగుండెల దగ్గరికి లాక్కొని దానిమీద గడ్డం ఆన్చుకుంటూ "నా జీవితంలో ప్రతిసంఘటనకి ఒక ప్రత్యేకమైన అధ్యాయం వుంటోంది. నిన్నా రోజున స్పృహలేనప్పుడు నా తొడమీద యీ తలని పెట్టుకుని తీసుకొస్తున్నప్పుడే అనుకున్నాను. మంచో చెడో నీతో నాకేదో వుండబోతుందని, థాంక్ గాడ్! మంచే జరిగింది."

"కాని మీరు" సారథి చేతుల్లోంచి తలని తప్పించుకుంటు అంది జయంతి.

"కాని _ యేమిటి? మనిద్దరిమధ్య యిహ కానీలు లేవు."

"అప్పుడు సారథితో నన్ను _" జయంతి వాక్యం పూర్తి చేయ్యలేకపోయింది. కళ్ళనిండా గిర్రున నీళ్ళు తిరిగాయి.

"అదంతా నాకు నువ్వు చెప్పక్కర్లేదు. నాకు తెలుసు. నేను నమ్ముతాను జయంతి_" జయంతి యింకా యేదో చెప్పబోతుండగా శేఖరం వారిస్తూ జయంతిని దగ్గరకు లాక్కొని నుదుట మీద ముద్దు పెట్టుకుంటూ అన్నాడు." నువ్వు హాస్పిటల్‌నుంచి డిస్చార్జ్ కాగానే సులభంగా, ఆడంబరం లేకుండా మిసెస్ శేఖరం అయిపోతావు అంతే'' అని చెప్తుండగానే శేఖరం పెదవులు నుదుట మీదనుంచి కళ్ళమీదకు జారి అక్కడ ఒక్క నిమిషం ఆగి జయంతి రెండు బుగ్గలని స్పృశించినాయి.

"అసలు నీకోసమె యిన్నాళ్లు యిలా ఒంటరిగా వున్నానని నాకిప్పుడు తెలుస్తోంది. చెప్పు అదృష్టం నీదా, నాదా?_''

''నాది. యిద్దరిదీ_'' నోరు తెరిచి పెదవులు విప్పి చెప్పబోయింది జయంతి. కాని చెప్పలేకపోయింది. ఈలోపల బుగ్గలమీద నుంచి హఠాత్తుగా క్రిందకు వచ్చిన శేఖరం పెదవులు జయంతి పెదవుల్ని బలంగా నొక్కేసినాయి.